
## 7వ జాతీయస్థాయి చిన్న కథల పోటీలలో తృతీయస్థాయి

## సోమేపల్లి సాహితీ పురస్కారం పొందిన కథ



# నిజాయితీ

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు

ఆదివారం.

బద్ధకంగా నిద్రలేచిన నేను కిటికీ దగ్గరకెళ్ళి కర్టెన్లు తొలగించాను. అద్దాల్లోంచి ప్రసరించిన ఎండ శరీరాన్ని చుర్రున కాల్చింది. నేను గడియారం చూశాను.

పది గంటలు.

రాత్రి ఫ్రెండ్స్‌తో పార్టీ చేసుకోవడంతో లేట్ నైట్ అయింది. సాధారణంగా అందుకే పార్టీలు శనివారాలు పెట్టుకుంటాను.

మా వీధిలో రాజభవనంలా ఠీవీగా వుంటుంది మా ఇల్లు. దీన్ని అపురూపంగా తీర్చిదిద్దుకోవడానికి ఎంత కష్టపడ్డానో! డబ్బు యొక్క విలువ చిన్నతనంలోనే తెలియడంతో మా నాన్నలా గానుగెద్దు ఉద్యోగ జీవితం - గొర్రె తోక జీతం కోసం ప్రయత్నించకుండా ఏదైనా బిజినెస్ చేయడానికి పథక రచన చేశాను. హడావుడిగా అలాంటిలాంటిది కాకుండా బాగా ఆలోచించి మేధోమథనం చేసి ఆఖరికి తట్టిన అద్భుతమైన ఐడియాకి ప్రాణం పోసి ఇరవై సంవత్సరాల పాటు అహర్నిశలు శ్రమించాను. అ స్థితికొచ్చాను. అదే అంతులేని తృప్తినిస్తుంది. డబ్బు విషయంలో నేను చాలా స్ట్రిక్ట్! ఇంటి ఎదురుగా అందంగా తీర్చిదిద్దబడిన గార్డెన్ వంక చూశాను. పచ్చని తివాచి పరచబడి దానిపైన రకరకాల పూలు అమర్చబడినట్టుంది. అలా అలా నా చూపు గేట్ వైపు మళ్ళింది. అక్కడ సెక్యూరిటీ అతను ఎవరో పిల్లని వెళ్ళిపొమ్మని గదమాయిస్తున్నాడు. కాని ఆ పిల్ల వదిలితేగా.

నేను విషయం తెలుసుకోవాలని ఇంటర్ కామ్‌లో సెక్యురిటీకి ఫోన్ చేశాను 'విషయమేమిటని?'.

"రెండు రోజుల్నుంచి వస్తోంది సార్ ఈ పిల్ల మిమ్మల్ని కలుద్దామని. వెళ్ళమంటే వెళ్ళదు. విషయం చెప్పదు." అన్నాడు, నేను తనని గమనించిన విషయం తెలిసి భయం ఆందోళన కలగలిపి.

"ఆ పిల్లను పైకి తీసుకురా" అని చెప్పి ఫోన్ పెట్టేశాను.

బాత్‌రూమ్‌లోకెళ్ళి ఫ్రెష్ అయి వచ్చేసరికి బెరుకు బెరుకుగా నుంచునుంది ఆ పిల్ల. పదిహేనేళ్ళుంటాయి. ఆమె భయం పోగొట్టడానికి "అలా కూర్చో" అని నవ్వి " నీ పేరేంటి?" అని అడిగాను.

**వార్త : సెప్టెంబర్ 29 కృష్ణాజిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'వృద్ధుల సమస్యలపై కవితా గోష్టి' కార్యక్రమం జరిగింది.**

"లక్ష్మండి.." అంది కూర్చోకుండా.

"అరె కూర్చో" అని చెయ్యిపట్టి కూర్చోపెట్టి "చెప్పు నన్ను ఎందుకు కలవాలనుకుంటున్నావు?" అడిగాను.

ఆమె కళ్ళలో నీళ్ళు నిండాయి. సన్నగా వెక్కుతూ "నేను ఓ తప్పు చేశానండి" అంది.

"ఏమిటది?" మృదువుగా అడిగాను.

"మరేమో.." అంటూ ఆపింది.

నాకు విసుగ్గా వుంది. కాని థ్రిల్లింగ్‌గా కూడా వుంది 'ఏం చెబుతుందో దానికీ నాకూ సంబంధం ఏమిటో' అని.

"మరేమో.. నండి.. నాలుగు రోజుల క్రితం.. ఒక.. పిల్లాడిని కుక్క వెంటబడి తరుముతోందండి. పాపం పిల్లాడేమో భయంతో బిక్కచచ్చిపోయి పరిగెడుతున్నాడండి. ఇంకాసేపట్లో ఆ పిల్లాడి పిక్క పట్టుకుంటుందనగా నేను చేతిలోకి రాళ్ళు తీసుకుని దానిపైకి విసిరానండి. ఆ కుక్క పిల్లాడిని విడిచి పారిపోయింది కాని.. కాని.." ఆగింది భయంగా.

ఏమైందన్నట్టుగా చూశాను.

"ఒక రాయి.. అక్కడే ఆగివున్న... మీ కారు వెనక.. లూటుకి తగిలి.. లైటు పగిలిపోయిందండి" అంది ఏడుస్తూ.

కారుని నిర్లక్ష్యంగా నడిపి లైటు పగలగొట్టాడని డ్రైవరుని నానా మాటలు తిట్టి దాని రిపేరుకైన డబ్బు అతని జీతంలోంచి తెగ్గోస్తానని తిట్టడం గుర్తొచ్చింది". నాకు కోపం నషాళానికి అంటింది. నేను ఆ పిల్లని తీవ్రమైన పదజాలంతో తిట్టేలోపు –

"అయ్యగారూ.. ఇది నేను ముంతలో దాచుకున్న డబ్బు. అమ్మా నాన్న అప్పుడప్పుడు ఇచ్చినది. నేను ఇళ్ళలో పాచిపని చేసి దాచినదీను. దీనితో మీ కారు లైటు బాగుచేయించుకోండి. అమ్మమీదొట్టు నేను కావాలని చేసింది కాదండి.." అని చిల్లరా, కొన్ని నోట్లు టీపాయ్ మీద పోసింది.

నా కోపం చల్లారిపోయింది.

ఏమిటీ పిల్ల? ఇంత చిన్న వయసులో ఏమిటీ నిజాయితీ? ఆకతాయితనంగా అల్లరిచేస్తూ పిల్లలు కారుమీద గీతలు గీయడం.. ఉమ్మిలేయడం.. అవీ ఇవీ విరగ్గొట్టడం తనకి తెలుసు. అందుకే అలాంటి పిల్లల్ని చూస్తే చాలా చిరాకు తనకు.. అలాంటిది తెలియకుండా.. జరిగిన తప్పుకి జరిమానా కట్టడానికొచ్చిన ఆ పిల్లని చూస్తే మొదటిసారి ముచ్చటేసింది.

ఎంతకీ నేను డబ్బులు ముట్టకపోవడంతో ఆ పిల్ల అనుమానంగా.. బాధగా "నాకు తెలుసండి! ఆ డబ్బులు సరిపోవని, ఖరీదయిన కారు కదండీ. ఇప్పటికిదుంచండి.. మళ్ళీ వారం పనిచేసి సంపాయించుకునొచ్చి మీకిస్తా!" అంది.

అప్పటికే నా మనసు బాధతో మెలితిరిగిపోయింది. "ఫర్వాలేదమ్మా! ఈ డబ్బు తీసుకెళ్ళు. నేను కారు బాగుచేయించుకున్నాను" అన్నాను.

"వద్దండి. తెలిసి చేసినా తెలియక చేసినా తప్పు తప్పేనండి. ఈ డబ్బులుంచుకోండి" అని బయటికి పరిగెత్తింది.

నేను గబగబ కిటికీ దగ్గరకెళ్ళి కర్టెన్ తీసి ఆ పిల్ల వెళ్ళే వరకు మసకబారిన కళ్ళతో చూస్తుండిపోయాను.

'నిజాయితీ! ఎన్నిసార్లు నిజాయితీకి తిలోదకాలిస్తే నేను ఈ స్థితికొచ్చాను. ఇంత సంపాదించినా ఇంకా కక్కుర్తి. అవినీతి పనులు చేయడం.,. టాక్సులెగ్గొట్టడం.. బ్లాక్ మనీ కూడబెట్టడం.. కాని ఆ పిల్ల? తను కష్టపడి కూడపెట్టుకున్న సొమ్ము శిక్షగా చెల్లించడానికొచ్చింది. మరి తను? ఛీ.. ఇకనుండైనా నిజాయితీగా బ్రతకాలి' అని అనుకున్నాక మనసు కాస్త తేలికపడింది. ❀

వార్త : సెప్టెంబర్ 19న విజయవాడలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో డా॥ రావెళ్ళ శ్రీనివాసరావు పరిశోధక గ్రంథం 'అలపర్తి వెంకటసుబ్బారావు రచనలు-పరిశీలన' ఆవిష్కరణ సభ జరిగింది.